క్లుప్తంగా

అర్హులందరికీ ఆహార భద్రత కార్డులు

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: రాష్ట్రంలో ఉన్న ప్రతీ నిరుపేదకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆహార భద్రత కార్డులను అందిస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. మంగళవారం పుర కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ కార్డు ద్వారా సన్న బియ్యంతో పాటు రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్మికుల ప్రయోజనం కోసం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మరోమారు గుర్తుచేశారు.

భక్తిశ్రద్ధలతో పలహారం బండి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న విక్రంరెడ్డి తదితరులు

మీర్‌పేట: బోనాల పండుగ సందర్భంగా జిల్లెలగూడ నవభారత్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారి పలహారం బండి ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అనిల్‌యాదవ్, నాయకులు అర్కల కామేశ్‌రెడ్డి, మాదరి రమేశ్, రాజ్‌కుమార్, యూత్ సభ్యులు శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

బడంగ్‌పేట్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ బుధవారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్రమోని పురుషోత్తం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఫీజుల మోత మోగిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను అప్పుల పాలు చేస్తున్నారన్నారు. ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ, డీఈఓ పోస్టులు భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలన్నారు. విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

అమ్మవారి దీవెనలతో సుభిక్షంగా ఉండాలి



బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీ మహిళా మండలి అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన బోనాల జాతరలో ఎమ్మెల్యే సబితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఆషాఢమాసంలో జరిగే బోనాల పండగకు ప్రత్యేకత ఉందని, తెలంగాలో బోనాల పండగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. ఖిల్లా మైసమ్మ అమ్మవారి దీవెనలతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మురుకుంట్ల అరవింద్, పెంద్యాల నగేష్, గొడుగు శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, కొండ్రా శ్రీనివాస్, ఊర్మిళ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కాలేజీల దోపిడీని అరికట్టాలి

హస్తినాపురం: ఇంజినీరింగ్ కళాశాలలో ఇష్టానుసారంగా దోచుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు టీఎస్‌టీసీఈ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం హస్తినాపురంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కళాశాలలకు ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి పాత ఉత్తర్వులే జారీ చేయడంతో రూ. వెయ్యి కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని, ప్రజాపాలనలో ప్రజలకు అన్యాయం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మేనేజ్‌మెంట్ సీట్లను ఆన్‌లైన్‌లో చేస్తామని చెప్పి, పాత పద్ధతిలోనే ఉత్తర్వులు జారీ చేసియడం అన్యామన్నారు.

ఆదర్శ నేత అచ్యుతానందన్

కేరళ మాజీ సీఎంకు సీపీఎం నేతల నివాళి



మీర్‌పేట: బాలాపూర్ చౌరస్తాలో అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మీర్‌పేట: కార్మికుల సమస్యలపై కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ ఎన్నో ఉద్యమాలు చేశారని, ఆయన మృతి తీరని లోటని సీఐటీయూ బాలాపూర్ మండల అధ్యక్షుడు దాసరి బాబు గుర్తుచేశారు. మంగళవారం బాలాపూర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి సీఐటీయూ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా అచ్యుతానందన్ కేరళను ప్రగతి పథంలో నడపడంతో పాటు విలువలతో కూడిన పాలన అందించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కోరెంకల నర్సింహ, సుంకోని యాదగిరిచారి, సీఐటీయూ మండల నాయకులు శేఖర్‌యాదవ్, వీరయ్య, దాసరి నర్సింహ, శంకరయ్య, నిరంజన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఆదర్శ నేత అచ్యుతానందన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు అన్నారు. ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం సీపీఎం నేతలు పార్టీ వ్యవస్థాపక సభ్యులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతికి సంతాపాన్ని ప్రకటిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బుగ్గరాములు మాట్లాడుతూ.. అచ్యుతానందన్ మరణం ప్రజా ఉద్యమాలకు, పార్టీకి తీరని లోటు అన్నారు. 17 ఏళ్ల ప్రాయంలోనే ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ.. కేరళ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. ఎమర్జెన్సీ కాలంలో తీవ్ర నిర్బంధం ఎదురైనా కమ్యూనిస్టు ఉద్యమాన్ని తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ జంగయ్య, పి. జగన్, నర్సింహ, ప్రభుదాసు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి గణేశ్, కృష్ణ, యాదగిరి, రాఘవేందర్, దాసు, యాదయ్య, బాలరాజ్, మహేశ్, వంశీ పాల్గొన్నారు.

సీపీఎంకు తీరని లోటు

తుర్కయంజాల్: కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి సీపీఎంకు తీరని లోటు అని పార్టీ నాయకుడు జె.ఆశీర్వాదం అన్నారు. అచ్యుతానందన్ మృతికి సంతాపంగా మంగళవారం తుర్కయంజాల్‌లో ఆ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, భాస్కర్, శారద తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు

మంచాల: కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం అగ్రనేత వీఎస్ అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అచ్యుతానందన్ సీపీఎం నాయకుడిగా ఎన్నో ప్రజా పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు గోపాల్, జంగయ్య, లెనిన్, అశోక్, వినోద్, ఐలయ్య, బాలరాజ్, గాలయ్య, సత్తయ్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు



తుర్కయంజాల్ చౌరస్తాలో..



మంచాల: నివాళి అర్పిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య తదితరులు

అర్ధరాత్రి మందుబాబుల వీరంగం

మలక్‌పేట: అర్ధరాత్రి మందుబాబులు వీరంగం సృష్టించడంతో బస్తీవాసులు భయాందోళనకు గురైన ఘటన మలక్‌పేట ఠాణా పరిధిలోని గడ్డిఅన్నారం బస్తీలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారం బస్తీకి చెందిన అరవింద్, హరిశంకర్, విశ్వేశ్వర్ ముగ్గురు స్థానిక బస్తీదవాఖానా ఎదురుగా ఉన్న లైన్‌లో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఇంతలో అదే ప్రాంతానికి చెందిన సాయి, మరో వ్యక్తితో వచ్చి బైక్‌పై వచ్చి దురుసుగా ప్రవర్తించడంతో ఇరువురి నడుమ వాగ్వాదం జరిగింది. కాసేపటి తర్వాత నరేష్ అలియాస్ నాచ్, బాబుల్లా, వంశీ, సురేష్, లిటిల్, రంజిత్ మరికొందరు కర్రలు, రాడ్లతో వచ్చి మీరు మా వాళ్లనే కొడతరా అంటూ వారిపై దాడికి పాల్పడ్డారు. వెంటబడి తరుముతూ కర్రలు, రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో హరిశంకర్ తలకు తీవ్ర గాయాలు కాగా కర్మన్‌ఘాట్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. అభిలాష్‌కు తలకు 8, విశేశ్వర్‌కు తలకు 18 కుట్లు పడ్డాయి. అరవింద్ మూతి, ముక్కుకు గాయాలయ్యాయి. వారించబోయిన వారిని సైతం గాయపరిచారు. శశికళ అనే మహిళ వారిని ఆపడానికి ప్రయత్నించగా ఆమెపై దాడి చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా అంగతులను గుర్తించేపనిలో పడ్డారు. కొందరు యువకులు ఇతర ప్రాంతాలకు చెందిన యువకులతో కలిసి గంజాయి తాగి ఇలా గొడవకు దిగుతారని బస్తీవాసులు పేర్కొంటున్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న వైద్యాధికారి అర్చన

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బంగారు మైసమ్మ దేవాలయంలో మంళవారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల తహసీల్దార్ కార్యాలయం, యునాని దవాఖానా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగులు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.అర్చన, ఆస్పత్రి సూపరింటెండెంట్ అనూప్‌కుమార్, సృజన, చంద్రశేఖర్, సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, స్థానిక నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తాం

చంపాపేట: కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి వారి దర్శనానికి హాజరయ్యే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆలయ పాలక మండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆలయ ప్రాంగణంలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నుంచి ఆలయంలోని పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు స్థానికుడు సోమలింగం గౌడ్ సొంత ఖర్చుతో ఏర్పాటు చేయనున్న పైపులైన్ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సోమలింగంగౌడ్ దంపతులను ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలను అందచేశారు.


ఎండోమెంట్ కమిషనర్ ప్రత్యేక పూజలు

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్ దంపతులు మంగళవారం ధ్యానాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించి ఆలయ ఈఓ లావణ్య, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రమాదేవి, వెంకటయ్య, వేణు, ఆలయ అర్చకులు అంబ ప్రసాద్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, సంతోష్‌శర్మ పాల్గొన్నారు.



కమిషనర్ వెంకట్రావ్ దంపతులతో ఆలయ సిబ్బంది

ముగిసిన మహంకాళి జాతర



సైదాబాద్‌లో అన్నదానంలో పాల్గొన్న సుభాష్‌చందర్‌జీ

సైదాబాద్: మార్కెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 47వ సంవత్సర మహంకాళి జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయని అసోషియేషన్ చైర్మన్ సుభాష్ చందర్‌జీ అన్నారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ చేపల మార్కెట్ వద్ద అసోషియేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం అమ్మవారికి బోనాల సమర్పణ, సోమవారం ఘటాల ఊరేగింపు, మంగళవారం భక్తులకు అన్నదాన కార్యక్రమంతో మూడురోజులు సాగిన మహంకాళి జాతర మహోత్సవాలు ముగిసాయన్నారు. జాతర మహోత్సవాలు ప్రశాంత వాతావరణంలో అంగరంగ వైభవంగా నిర్వహించడంలో సహకరించిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, పోలీస్ అధికారులు సిబ్బంది, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, సహదేవ్ యాదవ్, కడారి రాంకుమార్, పుష్పరాజ్, దినేష్ కుమార్, అశీష్, సర్వోత్తమ్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో పూజించుకోవడం మన సాంప్రదాయమని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. ఈ నెల 27న సరూర్‌నగర్‌లో బోనాల పండుగను పురస్కరించుకొని గ్రామదేవతల ఆలయాలను మంగళవారం ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సందర్శించారు. ఆలయాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. బోనాల ఉత్సవాలకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆమె జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రోడ్ల మరమ్మతులు, వీధిదీపాలు, మురుగునీటి సమస్య, ఆలయాల చుట్టూ పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేటర్ వెంట శానిటేషన్ డీఈ చందన, వర్క్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి పలు కాలనీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రోడ్డుకు మరమ్మతులు చేపట్టరూ!



నేదునూరు నుంచి బాచుపల్లి వెళ్లే కూడలి వద్ద దెబ్బతిన్న రోడ్డు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు నుంచి బాచుపల్లి వెళ్లే రోడ్డుపై గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, తమ ఇబ్బందులు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఫలితాలే పాఠశాల అభివృద్ధికి గీటురాయి

- మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి
- టీపీఎస్‌లో ప్రాథమిక పాఠశాల భవన ప్రారంభోత్సవం

మంచాల: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్(టీపీఎస్)లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. టీపీఎస్‌పై నమ్మకంతో పెద్ద ఎత్తున విద్యార్థులు అడ్మిషన్లు పొందారని.. ప్రభుత్వ సహకారంతో శాస్త్రీయతతో కూడిన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల ఫలితాలే పాఠశాల అభివృద్ధికి గీటురాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, ఏఎంసీ డైరెక్టర్ ఎల్లేశ్, హెచ్‌ఎం గిరిధర్ గౌడ్, మోహన్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సుప్రియ, ఎస్‌డీఎఫ్ సభ్యురాలు పద్మజాషా. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.డీ. జానీ పాష, జంగయ్య, రాజు, పారిజాత, సంధ్య, జ్యోతి, నాయకులు చంద్రయ్య, జంగయ్య, సురేశ్, రాము, రాజు పాల్గొన్నారు.